# స్వయంవరం

అది పది రోజుల కిందటి న్యూస్ పేపరు. ఆ పేపరు పరిశీలిస్తున్న చేతులు ...గా పేజీలు తిప్పుతున్నాయి. మధ్యపేజీలో ...ఖీయంగా కనిపిస్తున్న మాట్రిమోనియల్ ...మ దగ్గర ఆగిపోయాయి.

"పాతిక సంవత్సరాల వయసు గల ఎమ్. ఎ. చదివిన, ఆస్తి ఉన్న అమ్మాయికి అందమైన ముప్పయి సంవత్సరాలు పైబడిన వయసు ఉండి, నాలుగంకెల జీతం సంపాదించే ఉద్యోగి భర్తగా కావలెను. అర్హతలున్న ఉత్సాహం వంతులైన యువకులు ఈ క్రింద ఇచ్చిన అడ్రసుకు పది రోజుల్లోగా అప్లికేషన్స్ పంపుకోవచ్చు.

ఎస్. జానకి, కేరాఫ్ గోపాలరావు..."

తన వివాహ ప్రకటన వందోసారి చదువుకుంటున్న సదరు వధువు జానకి విలాసంగా నవ్వుకుంది. ఆమె పక్కనే గోపాలరావు గారి సెక్రెటరీ ఆనంద్, ఆమె నవ్వులో రాలే పగడాలు ఏరుకోవటానికి సిద్ధంగా నిలుచుని ఉన్నాడు.

నవ్వి నవ్వి ఆనంద్ వంక చూసి గతుక్కుమంది జానకి. ఆనంద్ తడబడుతూ ముఖం మరో పక్కకు తిప్పుకున్నాడు.

"సెక్రటరీ! ఎన్ని అప్లికేషన్లు వచ్చాయి?" ఠీవిగా కాలాడిస్తూ అడిగింది జానకి.

"ఇరవై మూడు వచ్చాయి, మేడమ్!" వినయంగా సమాధానమిచ్చాడు ఆనంద్.

"వాళ్ళందరినీ ఇంటర్వ్యూకు పిలవండి." ఆజ్ఞ ధ్వనించింది కంఠంలో.

"అలాగే, మేడమ్!"

• • • వు

మైన్స్ కార్పొరేషన్ యజమాని గోపాలరావు గారి ఏకైక పుత్రిక జానకి. తోడబుట్టిన లేదు. తండ్రి సంపాదించిన ఆస్తికి ఏకైక వారసురాలు. చిన్నప్పుడే తల్లిపోవటంతో తండ్రి సంరక్షణలో గారాబంగా ముద్దుగా పెరిగింది. గారాబంతో పాటు పెంకితనం, మంకుతనం అబ్బాయి. తండ్రి తెచ్చిన సంబంధాలకు ఏదో వంక చెప్పి పెళ్ళి వాయిదా వేస్తూ వచ్చింది ఇన్నాళ్ళూ.

ఈ కథ మొదలు కావటానికి పది రోజుల క్రితం తండ్రి బట్టతలను మురిపెంగా నిమురుతూ గారంగా అడిగింది జానకి—"డాడీ! నే నో మాట అడగనా?" అని.

"అడుగమ్మా. నా పర్మిషన్ కావాలేమిటి దానికి?" అన్నాడు ప్రేమగా కూతురు వంక చూస్తూ గోపాలరావుగారు.

"డాడీ! నా పెళ్ళి గురించి పేపరు ప్రకటన ఇస్తే బాగుంటుంది కదూ?"

గోపాలరావుగారి భ్రుకుటి ఒక క్షణం ముడి పడింది.

"అదేమిటమ్మా, గతి లేని వాళ్ళకు మళ్ళే పేపరు ప్రకటన దేనికి? మన అంతస్తు, ఆస్తి చూసి పెళ్ళి కొడుకులు మన కాళ్ళ దగ్గరికే వస్తారు చూస్తుండు."

"అది కాదు డాడీ! మగాడు, తనే పెద్ద గొప్పవాని అమ్మాయి కావాలని పేపర్లో గర్వంగా ప్రకటిస్తున్నాడా! మగాడి కున్న ఆ స్వాతంత్ర్యం, అధికారం ఆడదానికి ఎందుకు లేకపోవాలి?"



కరకంకణ విశ్వాణం

చిత్రం—టి. కృష్ణగిరిరావు (కాళ్యాణి)

# ఆంధ్రప్రభ

వారలకు, వ్యాఖ్యలకు, స్వతంత్ర భావ ప్రకటనకు
అందరియా అభిమానించే దినపత్రిక




## చర్మాన్ని తెల్లబరిచే ప్రత్యేక మైనది

చర్మ వైద్యులు మరియు సౌందర్య సలహాదారులచే ఆమోదించబడింది




అందంగా, తెల్లగా, కోమలంగా ఉండాలని మీరు కలలుకనే ముఖ వర్చస్సు పొందండి. ఫ్లోరోజోన్ లోని తెల్లపరిచే నిగూఢ రహస్యం పై పై మెరుపు కలిగిస్తుంది. శుభ్రపరుస్తుంది. చర్మపోషకం మరియు టానిక్, ఫ్లోరోజోన్, మొటిమలు, ముడుతలు, మచ్చలను సాఫీచేసి జారిపోయిన చర్మానికి నవ్యరూపం ఇస్తుంది.

## ఫ్లోరోజోన్

కాన్సంట్రేటెడ్ క్రీమ్ & లోషన్
హైజీనిక్ రిసెర్చి ఇనిస్టిట్యూట్
పోస్ట్ బాక్స్ 1192, బొంబాయి 400 001
ప్రముఖ కెమిస్టులు & దుకాణాలలో లభిస్తుంది

national-893 Tel


"నిజమేనమ్మా! నువ్వు చెప్పింది రైటే! మగాడు ప్రకటించినా అర్థముంది. మనం ప్రకటిస్తే ఈ పిల్లకి ఆస్తి ఉన్నా, మొగుడు దొరకడం లేదు కాబోలు, ఏదో ఉండి ఉంటుందని చెవులు కొరుక్కుంటారు."

"అలాంటివి లెక్క చేయకూడదు, డాడీ! అయినా, చూస్తుండు — ఎంతమంది మగాళ్ళు అప్లయి చేస్తారో. నా అంచనా ప్రకారం పాతికకు తగ్గదు సంఖ్య."

"ఏమిటంత గారంటీ?"

"ఈ కాలం మగాళ్ళ మనస్తత్వం నాకు తెలుసు, డాడీ! మీరు దీనికి అంగీకరించండి ముందు."

గోపాలరావుగారు ఇందుకు సుముఖంగా లేరు. వచ్చిన సంబంధాలన్నీ నచ్చలేదని వంకలు పెట్టి తిప్పేస్తుంది. ఇప్పటికే బంధువులందరిలో తలవంపులుగా ఉంది. ఇప్పుడు పేపర్లో ప్రకటిస్తే వచ్చే వ్యాఖ్యానాలను తను తట్టుకో గలడా!

"డాడీ!..." అసహనం చోటు చేసుకుంది జానకి కంఠంలో.

"సరేనమ్మా నీ ఇష్టం." లేచి వెళ్ళిపోయాడు గోపాలరావుగారు.

జానకి హుషారుగా కూనిరాగం తీసింది.

● ● ●

"హల్లో ఆనంద్! ఇంటర్వ్యూలు పంపించారా?" ఎప్పుడూ సెక్రెటరీ అంటూ పిలిచే జానకి— ఈరోజు పేరు పెట్టి పిలవగానే ఆనందం పట్ట లేకపోయాడు ఆనంద్.

"పంపించానండీ!" అన్నాడు హుషారుగా.

"మీరెప్పుడైనా, ఎవరినైనా ప్రేమించారా?" జానకి అలా అడగ్గానే ఆనంద్ మనసు ఆకాశంలో విహరించటం మొదలు పెట్టింది.

"ప్రేమించానండి." ఆడపిల్లలా సిగ్గుపడ్డాడు.

"ఎవర్ని?"

"మిమ్మల్నే!" ఏమయితే అయిందని తెగించి చెప్పేశాడు.

ఆశ్చర్యంతో అవాక్కయిపోయింది జానకి.

"మరి ఈ విషయం ఇన్నాళ్ళూ ఎందుకు చెప్పలేదు?"

ఆమె మాటలు అతనికి ఎంతో ప్రోత్సాహ కరంగా ఉన్నాయి. ఆమెకు తనంటే ఇష్టమే నన్నమాట!

"మీ దగ్గర పని చేసే వాడిని — నా పరిధి దాటడానికి సాహసించలేకపోయాను."

"ఇప్పుడెలా సాహసించారు?"

"మీరడిగారు కాబట్టి ధైర్యంగా చెప్పే శాను."

"మీరు మీ అర్హత మరిచిపోయి ఇలా అడిగి నందుకు మిమ్మల్ని ఉద్యోగంలోంచి తీసివేస్తే?"

కళ్ళనీళ్ళ పర్యంతమయింది ఆనంద్‌కి. పొర పాటున బయటపడి పోయాడు. ఇప్పుడు నిజం గానే ఉద్యోగంలోంచి తీసేస్తే ఏం చెయ్యాలి? తల్లి, పెళ్ళి కావల్సిన చెల్లెళ్ళు కళ్ళలో మెదులు తున్నారు. తన అవివేకాన్ని తిట్టుకున్నాడు. ఏం మాట్లాడితే ఏమవుతుందోనని భయంతో

బిక్క చచ్చిపోయాడు.

ఆనంద్‌ని చూస్తే జాలి వేసింది జానకికి. ఇతన్ని ఇంకా ఏడిపించాలనిపించింది.

"పోనీ, ఒక పని చేస్తే?"

ఆనంద్ అనుమానంగా చూశాడామె వంక.

"మిమ్మల్ని నేను చేసుకుంటాను. ఐవిల్ కీప్ యూ!" గర్వంగా తల ఎగరేసి అతని వంక చూసింది.

తల గిర్రున తిరిగిపోయింది ఆనంద్‌కి. ఎంత అహంకారం! తనని ఉంచుకుంటుందా? తనామె దృష్టిలో మగాడు కాదన్నమాట. తను దగ్గర పని చేస్తున్నందుకు ఇంత చులకనగా, అసహ్యంగా మాట్లాడుతుందా? అసలు ఇది ఆడదేనా? ఛీ మనిషి విలువ తెలియటం రాక్షసుల దగ్గర

డిగం చేసే కన్న అడుక్కు తినటం మేలు. ఈసారి తల్లీ చెల్లెళ్ళు అతని దృష్టిలో మెదల లేదు.

"చూడండి, మిస్ జానకీ దేవిగారూ! ఆడదాని కింత అహంకారం పనికిరాదు. మీ ఉప్పు తిని ఉండకపోతే మిమ్మల్ని ఏం చేసే వాడినో..." ఆవేశం అతని నోటి వెంట మరి మాట రానీయ లేదు.

బొమ్మిడి అచ్చారావు,
బర్ల వెంకటేశ్వర్లు

జానకి అతని వంకే ఆశ్చర్యంగా చూస్తూంది. ఇతనిలో కూడా ఇంత కోపం దాగి ఉందా? పిల్లి లాంటి వాడు పులిలాగా మారిపోయాడే!

"ఇప్పుడే ఈ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నాను" అన్నాడు నిర్లక్ష్యంగా ఆనంద్.

జానకి పడిపడీ నవ్వింది. ఆనంద్ విసురుగా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

"మిస్టర్ ఆనంద్! ఓకె టేటీజీ. మీరు నన్ను ప్రేమిస్తున్నాను అన్నప్పుడే నాకు బుద్ధి చెప్ప వలసింది. కాని మీకు చాన్స్ ఇచ్చాను. నే నన్న మాటకు తట్టుకోలేక పోయారు. అందుకే నా మాటను వాపసు తీసుకుంటున్నాను. మీరు ఉద్యోగం మానవలసిన పని లేదు" అంటూ గది విడిచి వెళ్ళిపోయింది జానకి.


ఏదో ఆలోచించుకుంటూ చాలాసేపు నిలబడి పోయాడు ఆనంద్.

• •

అది గోపాలరావుగారి ఆఫీసు గది. బయట విశాలంగా ఉన్న వరండాలోని కుర్చీల్లో దాదాపు ఇరవై ఎంది యువకులు కూర్చుని ఉన్నారు. అందరూ నీట్‌గా డ్రస్సు చేసుకుని ఉన్నారు. కొందరు ఫుల్‌సూట్స్‌లో ఉన్నారు. హుందాగా, టీగా కూర్చున్నారు. వారిలో ఏదో ఉత్సాహం ఉంది. కాంపిటీటివ్ స్పిరిట్ ఉంది. ఒకళ్ళ నొకళ్ళు తేరిపార చూసుకునేందుకు మొహమాట పడుతున్నారు? అంతమంది ఒకే కన్యను చూసుకోనటానికి వచ్చామనే న్యూనతాభావం కావచ్చు. వెనుకటి రాకుమార్తెల స్వయంవర ఘట్టాలు గుర్తు వస్తున్నాయి వాళ్ళను చూస్తూంటే. ఎవరిమటుకు వారు ఈ ఇంటర్వ్యూలో తనే నెగ్గుతానని, జానకీ పతి అవుతానని మనసులో వ్యూహాగానాలు చేస్తున్నారు.

అప్పటికే ఒకసారి టిఫిన్, రెండుసార్లు కాఫీ పంపించబడ్డాయి. అయితే దాదాపు రెండుగంటలు అలా కూర్చుని ఉండాలంటే బాధాకరంగానే ఉంది.

కూర్చున్న వాళ్ళలో సహనం నశిస్తూంది. పిలిచి అవమానించినట్టుగా బాధపడ్డారు. ఒకరిద్దరు అలస్యాన్ని భరించలేక తిరిగి వెళ్ళిపోదాం అను కుంటున్నంతలో ఇంటర్వ్యూ మొదలయిందనటానికి సంకేతంగా ఒక అభ్యర్థికి లోపలి నుండి పిలుపు



వజ్రోత్సవ
సంవత్సరము
1920 - 1980

DIAMOND JUBILEE YEAR
1920-1980




జాతీయ సేవలో మేము 60 సంవత్సరములు పూర్తి చేసినాము.

మా వాడుకదార్లు, అభిమానులు మా కొసంగిన అత్యంత సహాకారమునకు వారికి మా హృదయ పూర్వక కృతజ్ఞతాభివందనలు సమర్పిస్తూ, వారి సహాయ సహకారాలు ముమ్ముందు కూడా మా ఇతోధిక అభివృద్ధికి దోహదము కాగలవని మనః పూర్వకముగా నమ్ముచున్నాము.

కృష్ణవేణి ఇంకు ఫ్యాక్టరీ
751, టి. హెచ్. రోడ్, మద్రాసు-600 081.

తయారు చేయువారు : —
"క్రివేణి" ఫౌంటెన్ పెన్ ఇంకులు, స్టాంప్ ప్యాడ్ ఇంకులు, మార్కింగ్ ఇంకులు, నంబరింగ్ ఇంకు, లిక్విడ్ గమ్, మరియు ఆఫీసు పేస్టు.

Swastik

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

బహుళార్థ ప్రయోజనాలకు
బహు చిన్న మిక్సర్ అటాచ్‌మెంట్
మాధురీ మిక్సర్ మేట్




మసాలా, చట్నీ, పొడులు
ఎంత కావాలంటే అంత
పరిమాణానికి
ఉపయోగపడుతుంది.
పేరొందిన దేశీయ, విదేశీయ
మిక్సర్లన్నిటికి అమర్చవచ్చు.

తయారు చేయువారు :
MADHURI INDUSTRIES
36-A, Electronic Complex,
Kushaiguda, Hyderabad-500762
Phone : 78626

పంపిణీదారులు :
B.M.G. ENTERPRISES
50, Abid Shopping Centre
Near Hotel Emerald,
Hyderabad-500 001
Phone : 35705

డీలర్‌షిప్పు తదితర వివరములకు సంప్రదించండి

వచ్చింది. తక్కిన వాళ్ళు తేలికగా ఊపిరి పీల్చుకున్నారు.

ఆ అభ్యర్థి లేచి, కాలరు ఒక మారు సర్దుకుని, తక్కిన అభ్యర్థుల వంక ఒక చూపు విసిరి లోపలికి వెళ్ళాడు.

"మీ పేరు?" మధురంగా పలికింది జానకి కంఠం. అతడు ఆమె వంకే కన్నార్పకుండా చూస్తున్నాడు. ఈమె మానవ స్త్రీయా దేవలోక స్త్రీయా అనుకొంటున్నాడు.

జానకి హెచ్చరికగా దగ్గింది.

"నా పేరు కిశోర్" అన్నాడతను.

"ఏం చదువుకున్నారు?"

"బి. ఇ.—అసిస్టెంటు ఇంజనీరుగా చేస్తున్నాను."

"మీపై ఆధారపడిన వాళ్ళెవరైనా ఉన్నారా?"

"అమ్మ, తమ్ముడు, చెల్లెలు ఉన్నారు."

"నేను ఉద్యోగం చేస్తే మీకేమైనా అభ్యంతరమా?"

"మీకు ఉద్యోగం చెయ్యవలసిన అగత్యమేముంది? ఇంత ఆస్తికి ఏకైక వారసులు మీరు."

"అంటే, నా ఆస్తి మాసి పెళ్ళి చేసుకోవటానికి వచ్చారా?"

అతను కంగారు పడ్డాడు. "అబ్బే! అది కాదు నా ఉద్దేశం. ఏదో మాట వరస కన్నానంతే!" సర్దుకునే విఫల ప్రయత్నం చేశాడు. "మీరు ఉద్యోగం చేసినా నాకేం అభ్యంతరం లేదు."

"ఇక మీరు వెళ్ళవచ్చు."

అతను మెల్లగా లేచి వెళ్ళిపోయాడు.

రెండవ అతనికి పిలుపు వచ్చింది.

"మీ పేరు?" అడిగింది జానకి.

"ముందు మీ పేరు చెప్పండి!"

"నా పేరు పేపర్లో చూశారు కదా?

"నా పేరు అప్లికేషన్లో చూశారు గదా?"

జానకి క్షణకాలం గతుక్కుమంది.

"అప్లికేషన్ చూసి కాదు పిలుస్తూంట! మీరు కూర్చుని ఉన్న ఆర్డరులో పిలుస్తున్నాం. అయినా, మీరు చెప్పడానికి మీ కభ్యంతరమయితే, అప్లికేషన్ చూస్తాలెండి!" అంటూ ఒక సమ్మోహనాస్త్రం విసిరింది. మానవుడు దానితో చిత్తయిపోయాడు.

"రామారావు!" ఆమె వంక సిగ్గు పడుతూ చూస్తూ చెప్పాడు.

కొద్ది క్షణాల విరామం!

"మీకు ఇంతకు ముందు అనుభవ ముందా?" అతని వంక సూటిగా చూస్తూ అడిగింది.

"ఎందులో?" అతను కంగారు పడ్డాడు.

"ఐమీన్—ఇంతకు ముందే ఆడవాళ్ళతో శారీరకంగా..." అర్థోక్తితో ఆగిపోయింది జానకి.

అతను తడబడ్డాడు. ఇలాంటి ప్రశ్నలు ఉంటాయని అనుకోలేదు. అయినా, ఒక ఆడపిల్ల నిర్భయంగా సిగ్గు విడిచి అలా అడుగుతూంటే అతనికి ఆశ్చర్యంతో తల మునక లయినట్టుగా ఉంది. పొగరుగా సమాధానం చెప్పాలనుకున్నాడు. కాని, ఆమె అందం ముందు అతని నిశ్చయం ఎంతో సేపు నిలబడలేదు. ఏమీ సమాధానం చెప్పలేదు.

"నాకు పూర్వానుభవ ముంటే మీకు పెళ్ళి చేసుకోవటానికి అభ్యంతరమా?" అలవోకగా అడిగింది జానకి, మళ్ళీ.

కళ్ళు తిరిగినంత పనయింది రామారావుకి. అంటే ఈమె కన్య కాదన్నమాట. ఈమె విచ్చలవిడితనానికి, ఈ పెళ్ళికి ఒక నమస్కారం! ఈ అనుభవశాలీ వద్దు, ఈ ఆస్తీ వద్దు అనుకున్నాడు రామారావు విరక్తిగా.

వెంటనే లేచి నించుని—"తల్లీ! నీకు, నీతో పెళ్ళికి నమస్కారం! నీకు పెళ్ళి అనవసరం! చక్కగా నీ అనుభవాల్ని నెమరేసుకో. లేదా నీ కున్న డబ్బుతో నీకుకావలసిన, కావాలనుకున్న అనుభవాలన్నీ కొనుక్కో! వస్తా!" అని విసురుగా బయటికి వచ్చేశాడు. కూర్చుని ఉన్న తక్కిన అభ్యర్థుల వంక జాలిగా చూసి, చకచక వెళ్ళిపోయాడు.

ఇంటర్వ్యూ చివరి దశకు చేరింది. ఒకే ఒక అభ్యర్థి మిగిలాడు.

"నేను కూర్చో వచ్చునా?" ఏదో ఆలోచిస్తున్న జానకి ఈ మాటలకు ఉలిక్కిపడి సర్దుకు కూర్చుంది. ఎదురుగా ఆరడుగుల పొడవు ఉన్న విగ్రహం తననే సూటిగా చూస్తోంది.

"నా పేరు కృష్ణ చైతన్య." చైతన్య మంతా అతని గొంతులోనే ఉందనిపించింది. మంచి స్ఫురద్రూపి. కంచు కంఠం!

"కూర్చోండి."

అప్పటివరకు అందర్నీ అడిగిన అలవాటు ప్రకారం ప్రశ్నల పరంపర మొదలు పెట్టింది. అయితే, అతను జవాబు చెప్పిన వెంటనే తను ఏ ప్రశ్న వెయ్యాలా అని కాస్సేపు తటపటాయించ వలసి వస్తోంది. ఎందుకో అతని కళ్ళలోకి చూడాలంటే బిడియంగా ఉంది. ఇంతవరకు చూసిన వాళ్ళందరిలోను ఇతను ప్రత్యేకంగా కనిపిస్తున్నాడు. తనని ఆకర్షించాడు. తను అతని ముందు వ్యక్తిత్వం లేని దానిలా అనిపిస్తోంది.

ఎలాగో ఆ ప్రశ్న అడిగేసింది. "మీకు పూర్వానుభవం ఉందా?"

"మీ ఉద్దేశ్యం?" నవ్వుతూ అడిగాడు చైతన్య.

"అదే. శారీరకంగా." అతని ముఖం చూసే ధైర్యం లేకపోయింది. ఏమిటీతనలో ఈ బలహీనత?

అతను టక్కున చెప్పాడు. "ఓ ఎస్. కావలసినంత అనుభవ ముంది."

"నాకూ పూర్వానుభవ ముంది. మీ కభ్యంతరమా?" జానకి అంది.

"నో నో! మీకు అనుభవమున్నా మిమ్మల్ని పెళ్ళి చేసుకోవటానికి నా కభ్యంతరం లేదు ఎందుకంటే దేనికైనా పూర్వానుభవం ముఖ్యం!"

అతని వంక కళ్ళు తేలేసి చూస్తూండి పోయింది జానకి.

చైతన్య చెప్పుకు పోతున్నాడు.

"ఒక స్త్రీ తెలిసో తెలియకో కాలు జారితే ఆమెను పెళ్ళి చేసుకుని ఉద్ధరించవలసిన బాధ్యత నేటి యువతరానికి ఉంది. నేను వాళ్ళకి ప్రతినిధిని. తప్పు చేయడం మానవ సహజం. తప్పు అనేది శారీరక మయినది కాదు; మానసిక మయినదని నా అభిప్రాయం. నా మాటకి వస్తే మీ లాంటి కాలు జారిన స్త్రీనే పెళ్ళి చేసుకోవాలని నా ఆశయం. ఆస్తి ఉండీ, పాతికేళ్ళు పై బడ్డా మీకు పెళ్ళి కాలేదంటే మీ నిజాయితీయే కారణం! మీరు చేసిన పని ఒప్పుకుంటున్నారు. మీ రీ ప్రశ్న అడక్కపోయినా నేనే అడిగేవాణ్ణి! అప్పుడు మీకు అనుభవం లేదంటే వెంటనే తిరిగి వెళ్ళి పోయే వాణ్ణి. నా ఆశయం ఈ విధంగా నెరవేరినందుకు, కాలు జారిన ఒక స్త్రీని చేయూత నిచ్చే అవకాశం లభించినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది!"

అతను చెబుతున్నంతసేపూ మంత్రముగ్ధలా అతని వంకే చూస్తూ విన్నది జానకి.

"మీరు నా ఆస్తి చూసి, నా గుణగణాలను లెక్కకు తీసుకోవటం లేదేమో?" రెచ్చ గొట్టింది జానకి.

నవ్వుకున్నాడు చైతన్య.

"నీ కున్న ఆస్తి కన్న రెట్టింపు ఆస్తి ఉంది నాకు. నీది పైసాకూడా నేను తాకను. కాని, ఒక్క విషయం గుర్తుంచుకో! నీ అంత నిర్భయంగా 'నాకు పూర్వానుభవం ఉంది' అని చెప్పిన స్త్రీని ఏ మగాడూ పెళ్ళి చేసుకోడు. మగాడి హృదయం అంత విశాలమయినది కాదు. ఆస్తి కోసంచేసుకుంటే చేసుకోవచ్చు కాని మూడవ నాటికి నిన్ను నడిరోడ్డుని బికారిని చేసి వదిలేస్తాడు. గుర్తుంచుకో!" అన్నాడు.

జానకి మౌనంగా అతన్నే చూస్తోంది.

"నీ లాంటి స్త్రీలు అంటే నాకు సానుభూతి. ఎందుకో తెలుసా? మా అక్కయ్య ఇలాగే మోస పోయింది. ఆమెను నమ్మించి ఆమె శీలాన్ని హరించి పారిపోయాడో దౌర్భాగ్యుడు. ఆమెకు చేయిఅందించే మగాడు లేకపోయాడు. అవమానంతో, విరక్తితో ఆత్మహత్య చేసుకుంది. అంతే! ఆ సంఘటన నా మనసుమీద తీవ్రమైన ముద్రవేసింది. అలా మోస పోయిన స్త్రీకి చేయూత నివ్వాలని, నా భార్యగా చేసుకోవాలని అప్పుడే నిర్ణయించుకున్నాను. అందుకే ఆ ఆశయంతోనే నీకు నా చేయి అందించ దలచుకున్నాను. అందుకో గలిగితే, అందుకో!" చెయ్యి చాపాడు చైతన్య.

జానకి అతని చెయ్యి ప్రేమగా పట్టుకుని ముద్దు పెట్టుకుంది.

చైతన్య విజయగర్వంతో చూశాడు.

* * *

శోభనం గదిలోకి జానకిని సుతారంగా నెట్టి కిలకిల నవ్వుకుంటూ వెళ్ళిపోయారు ముత్తయిదువలు.

జానకి తలుపు దగ్గరే మౌనంగా నిలుచుండి పోయింది.

చైతన్య లేచి నవ్వుతూ ఆమె చెంత చేరి, "ఎందుకు సిగ్గు పడతావు? నీకుగాని, నాకుగాని ఇదే మొదటి రాత్రి కాదుకదా?!" అంటూ కొంటెగా చూశా డామె వంక.

జానకి ఉక్రోషంతోను, కోపంతోను అదిరే పెదవుల్ని చిక్కబట్టుకుని, "క్షమించండి! ఇంటర్వ్యూలో గర్వంగా అలా అన్నానే గాని, నాకేపూర్వానుభవమూ లేదు. మగాళ్ళ ఆధిక్యం పట్ల, వాళ్ళుచేసే అన్యాయాల పట్ల నాకు కసి, మంట! నా స్నేహితురాళ్ళు ముగ్గురు—మగవాళ్ళ ఇనుప కోరల మధ్య నలిగి నాశనమయి పోయారు. ఒక అమ్మాయి భరించలేక ఆత్మహత్య చేసుకుంది. మరొక అమ్మాయి గర్భస్రావం చేసుకోబోయి, ప్రాణాలు పోగొట్టుకుంది. మూడోది ఇంట్లో ముఖం చూపించలేక వ్యభిచార గృహాల పాలయింది. వాళ్ళు ముగ్గురు నాతోచిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్నారు. వాళ్ళకు జరిగిన అన్యాయాలకి కారణాలైన మగజాతి మీదే అసహ్యం పుట్టింది.

"అందుకే ఇంటర్వ్యూ పేర మగవాళ్ళని పిలిచి ఏడిపించా లనిపించింది. వాళ్ళ రియాక్షన్స్ చూడా లనిపించింది. అసలే అపురూపంగా, గారాబంగా పెరిగాను. వీటికి అహంకారం, పురుష ద్వేషం తోడయినాయి. ఆద్వేషం అహంకారం, ఇంటర్వ్యూలో మరొక రూపాన బయట బడ్డాయి. ఇష్టం వచ్చినట్లు తిక్కప్రశ్న లడిగాను. కసి తీర్చుకున్నాను. కాని, మిమ్మల్ని చూసిన క్షణంలోనే నాలోని పురుషద్వేషం మటుమాయమైంది, దానిస్థానే మీ పట్ల అనురాగం, ఆరాధన చోటు చేసుకున్నాయి. నా ప్రవర్తన సిగ్గుమాలినదని నాకు తెలుసు. నన్ను మనస్ఫూర్తిగా క్షమించమని మీ పాదాలంటి కోరుకుంటున్నాను" అంటూ చైతన్య పాదాల నంటింది.

ఆమె నిజాయితీకి నిదర్శనంగా కన్నీళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి.

చైతన్య పెద్ద పెట్టున నవ్వి, ఆమెను లేవనెత్తి కన్నీళ్ళు తుడిచాడు. "పిచ్చిదానా! ఈ విషయం నాకు ముందే తెలుసు. నువ్వు అనాఘ్రాణితపుష్పానివని, పెంకె ఘటమనీ, నీ ముక్కు తాడు వేసే మగాడు దొరకలేదని — అన్నీ తెలుసు. తెలుసుకునే నీ ఇంటర్వ్యూకి హాజరయ్యాను" అన్నాడు.

జానకి బొమ్మలా నిలుచుండి పోయింది మాట రాక.

"ఇది నీకు ప్లెజంట్ సర్ ప్రైజ్ అని నాకు తెలుసు. మీ నాన్నగారు, మా నాన్నగారు బాల్య స్నేహితులు. నీ పెంకి తనం గురించి మీ నాన్నగారు మా నాన్నగారితో చెప్పి బాధపడ్డారు. పేపర్లో ప్రకటన వేయిస్తున్నామని కూడా చెప్పారు. మీ నాన్నగారికి నన్ను అల్లుడుగా చేసుకోవాలని ఎన్నాళ్ళ నుండో అభిప్రాయముంది. మా నాన్నగారినీ విషయం అడిగారు. ఆయనకీ ఇష్టమే గాని, నీ పెంకితనం గురించి విని, కొంత జంకారు. నాతో వివరంగా చెప్పారు. నేను నీ ఇంటర్వ్యూకి హాజరై నీ సంగతి తేల్చుకోవాలని నిర్ణయించుకున్నాను. ప్రకటనవద్దాక అప్లై చేశాను. నీది మేకపోతు గాంభీర్యమని ఇంటర్వ్యూలో తేలిపోయింది. నాకు లేని అక్కను సృష్టించి, కథ అల్లాను. అంతే! నా వలలో చిక్కిపోయావు" అన్నాడు చైతన్య కొంటెగా నవ్వుతూ.

జానకి ఇంకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు.

"నన్ను ... నన్ను ... ఇంత మోసం చేస్తారా?" ఉక్రోషంగా అంది.

"మోసంకాదు, అహంకారానికి అందమైన బంగారు కళ్ళెం!" ఆమె నడుము పట్టి దగ్గరగా లాక్కున్నాడు.

ఆ తర్వాత జానకి మరి మారాం చెయ్యలేదు. ★

**ఏవో** పాత కాగితాలు తిరగేస్తూంటే రాఘవేంద్రరావు కంటబడిందా ఉత్తరం. అయిదేళ్ళ క్రితం ఆ ఉత్తరం తెచ్చిన యువకుని దీనవదనం అతనికి జ్ఞాపకం వచ్చింది. ఇంటర్వ్యూ ముందు రోజు రాత్రి ఆ ఉత్తరాన్ని తన చేతిలో పెట్టి, చేతులు కట్టుకుని వినయంగా నిలబడ్డాడు ఆ యువకుడు, ఆ రోజున.

ఆ ఉత్తరాన్నే ఇప్పుడు చదువుతున్నాడు రాఘవేంద్రరావు.

"అధికారుల పాద తామరలకు గోతుల చుంచులేశ్వరరావు వ్రాసుకున్న ధరఖాస్తు విన్నపాలు.

అయ్యా,

తమలాంటి పెద్దోల్లను చూస్తే నాకు బయం. గుండెదడ. అదెప్పుడో గాంధి గారు తండ్రికి ఉత్తరం రాసి చూపించినట్టు నేను కూడా ఉత్తరం రాసుకొచ్చి మీకు చూపిత్తున్నా. పూర్తిగా చదువుకోండి సార్.

అయ్యా, నేను తమ కార్యాలయంలో ఉండుకున్న కాలీ గుమాస్తాను నాతో బర్తీ చేయగలందులకు కోరి ప్రార్దిస్తూ తమర్ని ముందుగా కలిసి ఇసయాలు చెప్పుకోవాలని వచ్చాను సార్!

నా హర్హతలు.

నేను బియ్యే. నా స్నేహితుడు నాకు సానా దూరంగా కూర్చున్నందువల్లనూ, కాపీ చేయడాన్కి తెచ్చుకున్న స్లిప్పుల్లో దేని కేది రాయాలో వాచరు చెప్పకపోవడం వల్లనూ పస్టుక్లాసు కొద్ది మార్కుల్లో తప్పిపోయింది సార్!

సెడ్యూలుఖాస్టులకు యిరవై శాతం, వెనుకబడిన వారికి ముప్పై శాతం, మిగిలినవి ఢిల్లీ మాస్టారి బందువులకూ కేటాయించడం వల్ల నాకు గేమ్సులో మెడల్లు రాలేదు సార్. సర్టిపికేట్లూ రాలేదు. ప్రెష్ ఎయిర్‌లో కసరత్తు చేస్తే ఆరోగ్యానికి మంచిదని తెలిసినా బారద్దేశం నిండా దుర్గాలి వీస్తోంది సార్. అందుకే నేను కసరత్తులు గట్రా చేయలేదు. సన్నగా అనారోగంగా కనిపిస్తున్నాను గాని ఆపీసు పైల్లను అక్కడ నుండి ఇక్కడకు మోసుకు పోడానికీ, అటే మీద పెన్ను నడిపించడానికీ తగిన సక్తి నాకున్నదని ప్రమాణముచేసి చెప్పుచున్నాను. మీరు కృష్ణ భక్తులని నాకు తెలుసు. నేనూ అంతే. మొదటి రోజు మొదటాటకే కృష్ణ నటించిన సినిమా టికెట్ మీకు తెచ్చి పెట్టగలను. సామర్ధ్యంగా, వినయంగా వంగి మీకు నమస్కారం పెట్టగలను. ఇంగిలీసులో సంతకం — పొట్టీ, పొడవూ— పెట్టగలను. తమ యింటికి కావలసిన కూరగాయలూ, సరుకులూ నాణ్యమైనవిగా చూసి తీసుకు రాగలను. చేతులు తడుపుకోగలను. తడపగలను. ఆపీసులో యితరులు మీ గురించి చెప్పుకునే యిసయాలన్నీ బద్రంగా మీకు చేరవేయగలను.

ఇన్ని హర్హతలున్న నన్ను తప్పక సెలచ్చన్ చేయుదురని నమ్ముచున్నాను.

నమస్కారం సార్! ఉంటాను సార్! తమ దయ సార్!

తమ హిస్సానపాత్రుడు,
—గో. చుం. రా."

మాతృభాష కూడా సరిగా వ్రాయలేని ఆ బి. ఎ. ని చూసి నవ్వాలో, జాలిపడాలో తెలియలేదు రాఘవేంద్రరావుకు—తల ఎత్తగానే, అందుకోసమే ఎదురుచూస్తున్నట్టు, "దక్షిణ" ఇవ్వబోయాడు.

అతనికి ఉద్యోగం ఇవ్వలేదు. కాని, ఆ ఉత్తరం పాత కాగితాల్లో ఇప్పుడు బయట పడింది. 'పాపం! అతనికి ఉద్యోగం దొరికిందో, ఇంకా నిరుద్యోగిగానే ఉన్నాడో?' అని నిట్టూర్చాడు.

వారం క్రితం హైదరాబాదు ఇంటర్వ్యూకు వెళ్ళిన అబ్బాయి శ్రీన్ తిరిగి రాలేదు. ఉత్తరమూ లేదు.

శ్రీన్‌కి అన్ని అర్హతలూ ఉన్నాయి. యూనివర్సిటీ ఫస్ట్. ఆటల్లో బెస్ట్. వినయ విధేయతలు మోస్ట్! న్యాయంగా అయితే ఉద్యోగం అతనిదే. కాని, లేనివి రెండే — ఉత్తరమూ, దక్షిణమూ!

భర్త ఆఫీసర్ అయి ఉండీ కొడుక్కి ఉద్యోగం



భర్త చేతిలో ఉన్న ఉత్తరం చూడగానే కామాక్షమ్మ ఆత్రతగా వచ్చింది—"అబ్బాయి వ్రాశాడా?" అంటూ.

"ఇది అబ్బాయి వ్రాసింది కాదులేవే!" విసుక్కున్నాడు. ఆమె చిన్నబుచ్చుకుంది.

అతడు విసుక్కోవడానికి కారణం ఉంది.

సంపాదించలేకపోవడం ఏమిటి? కామాక్షమ్మకు ఇది జవాబు లేని ప్రశ్న!

జవాన్లు చెప్పుకునే మాటల్నిబట్టి—ఆయన ఆఫీసులో చాలా నిష్కర్షగా ఉంటారు. అవినీతికి ఆమడ దూరంలో ఉంటారు. క్రింది ఉద్యోగులు ఆయన్ని తిట్టుకుంటారనీ ఆమెకు తెలుసు.